క్లుప్తంగా

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ప్రచారం



త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలతో బోని ప్రజలు

ఆనందపురం : విజయరాంపురం హిందూ జ్ఞానవేదిక, ప్రబోధ సేవా సమితి సభ్యులు త్రైత సిద్ధాంత భగవద్గీతపై మండలంలోని బోని గ్రామంలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు త్రినాథరావు మాట్లాడుతూ రాబోయే ఉత్తరాయణం, భోగి, సంక్రాంతి పండగల విశిష్టతను తెలియజేయడానికి ప్రచారం నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు జి.కృష్ణ సూరప్పడు, ఎస్.శ్రీనివాస్, వి.భవానీ, లక్ష్మి, భవానీ తదితరులు పాల్గొన్నారు.

తప్పిన పెను ప్రమాదం



ప్రమాదంలో దెబ్బతిన్న బడ్డీలు

కొమ్మాది: సాగర్‌నగర్‌లో ఓ కారు బీభత్సం సృష్టించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... జీవీఎంసీ 8వ వార్డు సాగరేశ్వర ఆలయం సమీపంలో ఆదివారం అర్ధరాత్రి అతి వేగంగా ఓ కారు దూసుకొచ్చి బీభత్సం సృష్టించింది. అదుపు తప్పి నేరుగా రోడ్డు పక్కన ఉన్న రెండు బడ్డీలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అవి పూర్తిగా దెబ్బతిన్నాయి. అయితే అర్ధరాత్రి సమయం కావడంతో అక్కడ ఎవరూ లేనందున పెను ప్రమాదం తప్పిందని, లేకుంటే తీవ్ర ప్రాణ నష్టం జరిగి ఉండేదని స్థానికులు అంటున్నారు. బడ్డీ యజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సాయి గణపతి విద్యార్థుల ప్రతిభ



ఈశ్వర్ వర్ధన్‌ను అభినందిస్తున్న సాయి గణపతి కళాశాల అధ్యాపక సిబ్బంది

ఆనందపురం : మండలంలోని గిడిజాలలో ఉన్న సాయి గణపతి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచి పలు పతకాలు సాధించారు. ఈ నెల 4న అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన వంద మీటర్ల పరుగు పందెంలో కళాశాల విద్యార్థి ఎస్.ఈశ్వర్ వర్ధన్ బంగారు పతకం సాధించాడు. 200, 400 మీటర్ల విభాగంలో సిల్వర్ పతకాలు కూడా సాధించి రాష్ట్ర స్థాయిలో వ్యక్తిగత చాంపియన్‌షిప్ కై వసం చేసుకున్నాడు. షార్ట్‌పుట్ విభాగంలో కె.లక్ష్మణ్ కాంస్య పతకాన్ని, 800 మీటర్ల పరుగుపందెంలో మల్లేశ్వరి సిల్వర్ పతకం సాధించారు. ఈ మేరకు విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయులు వెంకట్రాజు, రమేష్ నాయుడు, కరస్పాండెంట్ వేణు గోపాల్, అధ్యాపకులు అభినందించారు.

వృద్ధురాలి మెడలోని బంగారు ఆభరణాలు చోరీ

తగరపువలస: చిట్టివలస గణేష్ థియేటర్ వద్ద యూనియన్ బ్యాంకు ఎదురుగా గల బొర్రా సీతారత్నం ఇంట్లోకి సోమవారం ఉదయం గుర్తు తెలియని మహిళ చొరబడి ఆమె మెడలోని నాలుగున్నర తులాల బంగారు ఆభరణాలు కాజేసింది. భీమిలి క్రైమ్ సీఐ కె.సురేష్, ఎస్ఐ సూర్యప్రకాష్ తెలిపిన వివరాల ప్రకారం... ఉదయం 5.30 ప్రాంతంలో ఇంటి ముందు పువ్వులు ఏరడానికి సీతారత్నం బయటకు వచ్చి అరగంట వ్యవధిలో మళ్లీ ఇంట్లోకి చేరుకుంది. ఆ సమయంలో గుర్తు తెలియని 50 ఏళ్ల మహిళ ముఖానికి గుడ్డ కట్టుకుని టీవీ, లైట్లు ఆపేసి ఇంట్లో నక్కింది. సీతారత్నం ఇంట్లోకి చేరగానే ఆభరణాలు తెంపడానికి ఆ మహిళ ప్రయత్నించింది.

ఈ సందర్భంగా సీతారత్నం ప్రతిఘటించగా నాలుగు లైన్ల బంగారు చైన్‌లో కొంత భాగం మిగలగా... నిందితురాలు 2 తులాల బంగారు పుస్తెలతాడు, 2.5 తులాల నాలుగు పేటల చైన్ కాజేసింది. దర్యాప్తులో భాగంగా పరిసర ప్రాంతాల్లోని సీసీ కెమెరాలను పోలీసులు పరిశీలించగా... సోమవారం ఉదయం 6 గంటల సమయంలో సంతపేట అంకిత రెడీమేడ్స్ వైపు వచ్చిన నిందితురాలిని గుర్తించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యం

- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- 6వ వార్డులో రూ.1.66 కోట్లతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంకను సత్కరిస్తున్న కాలనీవాసులు



గాయత్రినగర్ వద్ద రైల్వే ఆఫీసర్స్ లే అవుట్‌లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, తదితరులు

మధురవాడ: అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 6వ వార్డు కార్‌షెడ్ జంక్షన్ వద్ద బీటీ రోడ్డు నిర్మాణం, తులసినగర్, రైల్వే ఆఫీసర్స్ లే అవుట్‌లో అనుసంధాన కల్వర్టు, కొమ్మాది విలేజ్, టీచర్స్ లే అవుట్‌లో రోడ్లు, కాలువల నిర్మాణం, శంభువానిపాలెంలో కమ్యూనిటీ హాలు మరమ్మతులను రూ.1.66 కోట్లతో చేపడుతున్నారు. వీటికి వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంకతో కలిసి గాయత్రినగర్ సమీపంలోని రైల్వే లే అవుట్ వద్ద సోమవారం సాయంత్రం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమాన ప్రాధాన్యమిస్తోందని చెప్పారు. మేధావి మౌనం మంచిది కాదని, వారు తమ ఓటు ఖచ్చితంగా ఉపయోగించుకోవాలని కోరారు. అభివృద్ధి చేయడం లేదని ప్రతిపక్ష నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని... భీమిలి, మధురవాడలో రూ.600 కోట్లతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. అభివృద్ధిపై చర్చకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

ఈ సందర్భంగా తమ అపార్ట్‌మెంట్లు, ఇతర నివాసాలకు కల్వర్టు తమ చిరకాల కోరిక అని కాలనీ అధ్యక్షుడు రాంబాబు, అధ్యాపకుడు అచ్యుత రామం చెప్పారు. ఈ పనులకు భూమి పూజ చేసినందుకు కార్పొరేటర్ ప్రియాంక, ఎమ్మెల్యే శ్రీనివాసరావును స్థానిక మహిళలు, అపార్ట్‌మెంట్ల వాసులు ఘనంగా సత్కరించారు. నెల రోజుల్లో పనులు పూర్తి చేయాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. సంక్షేమం, అభివృద్ధి, ప్రజలకు చేరువలో పాలన కొనసాగాలంటే మళ్లీ జగన్ మోహన్ రెడ్డే సీఎం కావాలన్నారు. కార్యక్రమంలో జెడ్సీ కనక మహాలక్ష్మి, ఏఈ సురేష్, వార్డు గౌరవాధ్యక్షుడు డాక్టర్ గాదే రోశిరెడ్డి, పోతిన ప్రసాద్, పోతిన ఎల్లాజీ, జహనార, పోతిన సన్యాసిరావు, పోతిన సూరిబాబు, వివి నరసింహారావు, జామి శివ, పిళ్లా రమణ, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తరలింపు



ఆర్‌డీవో కార్యాలయం మేడపై నిర్మించిన షెడ్డు



కార్యాలయంలో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది

భీమునిపట్నం: భీమిలిలోని తహసీల్దార్ కార్యాలయాన్ని పక్కనే ఉన్న ఆర్‌డీవో కార్యాలయం మైడపైకి అధికారులు సోమవారం తరలించారు. 1861లో ఇక్కడి కార్యాలయాన్ని నిర్మించారు. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి కార్యాలయాన్ని ఇక్కడే కొనసాగిస్తున్నారు. పదేళ్లుగా భవనం దెబ్బతినడంతో ప్రస్తుత కార్యాలయం పక్కన కొత్త భవనాన్ని నిర్మించారు. అయితే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భీమిలికి రెవెన్యూ సబ్ డివిజన్ మంజూరు కావడంతో మూడు సంవత్సరాల క్రితం ఈ కొత్త భవనంలోనే ఆర్‌డీవో కార్యాలయం ఏర్పాటు చేశారు. దీంతో తహసీల్దార్ కార్యాలయం ఏర్పాటుకు అవకాశం లేకుండా పోయింది. ఈ క్రమంలో కార్యాలయ భవనం పూర్తిగా పాడైపోయి శిథిలమైపోయింది. దీంతో వెంటనే దాన్ని ఖాళీ చేయాల్సిన పరిస్థితి నెలకొనడంతో ఆర్‌డీవో కార్యాలయంపై తాత్కాలికంగా పెద్ద షెడ్డు ఏర్పాటు చేసి అందులోకి కార్యాలయాన్ని తరలించారు. పాత కార్యాలయాన్ని కూల్చివేసి కొత్త భవనం నిర్మించడానికి అధికారులు నిర్ణయించారు. ఈ మేరకు నిర్మాణం పూర్తయ్యేంత వరకు ఇక్కడ ఏర్పాటు చేసిన షెడ్డులోనే కార్యాలయాన్ని నిర్వహిస్తారు.

పేద కుటుంబానికి పెద్ద కష్టం

- రెండు కిడ్నీలు పాడై మంచానపడిన ఇంటి యజమాని
- దాతల సాయం కోసం ఎదురుచూపు



కిడ్నీలు పాడై చికిత్స పొందుతున్న వెంకటరావు

ఆనందపురం : ఆ పేద కుటుంబానికి పెద్ద కష్టం వచ్చి పడింది. కుటుంబ పెద్దకు రెండు కిడ్నీలు పాడై మంచాన పడడంతో పూర్తిగా పేదరికంలో ఉన్న ఆ కుటుంబ సభ్యుల చేతిలో చిల్లి గవ్వ కూడా లేకపోవడంతో ఒక వైపు ఇంటి యజమాని ప్రాణాలు కాపాడుకోవాలనే తాపత్రాయం, మరో వైపు తిండికి కూడా ఇబ్బంది పడే దైన్య స్థితి. మండలంలోని వెల్లంకి ఎస్సీ కాలనీకి చెందిన బవిరిశెట్టి వెంకటరావు (41) సెక్యూరిటీ గార్డు ఉద్యోగం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మూడేళ్ల క్రితం అతనికి ఒక కిడ్నీకి ఇన్‌ఫెక్షన్ సోకింది. దానికి చికిత్స చేయించుకుంటుండగా రెండో కిడ్నీకి ఇన్‌ఫెక్షన్ సోకింది. దీంతో సుమారు రూ.12 లక్షల వరకు అప్పులు చేసి వివిధ ఆస్పత్రుల చుట్టూ తిరిగి చికిత్స చేయించుకున్నా ఆరోగ్యం మెరుగుపడలేదు సరికదా రెండు కిడ్నీలు పూర్తిగా పని చేయడం మానేశాయి. దీంతో ఆరోగ్య శ్రీ పథకం ద్వారా ఉచితంగా డయాలసిస్ చేయించుకుంటూ నెట్టుకొస్తున్నాడు. ఇటీవల ఆరోగ్యం మరింత క్షీణించడంతో డాక్టర్లను సంప్రదించారు. కిడ్నీ మార్పిడి చేయడం తప్ప రెండో మార్గం లేదని డాక్టర్లు తేల్చి చెప్పేశారు. కిడ్నీ మార్పిడికి రూ.12 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు వివరించారు. దీంతో తల్లి యల్లయ్యమ్మ కిడ్నీ దానం చేయడానికి ముందుకొచ్చింది. కానీ శస్త్ర చికిత్స కోసం రూ.12 లక్షలు ఖర్చు కానుండడంతో ఆ పేద కుటుంబం తల్లడిల్లుతూ ఆదుకునే వారి కోసం వేయి కళ్లతో ఎదురు చూస్తోంది. భార్య కుమారి, కుమారుడు, కుమార్తెలు కేవలం వెంకటరావు సంపాదన పైనే ఆధారపడి జీవిస్తున్నారు. మూడేళ్ల నుంచి అప్పులపాలై ఆపన్న హస్తాల కోసం ఎదురు చూస్తున్నారు. తమను ఆదుకోవడానికి సాయం చేయదలచిన దాతలు 9701562031, 9000728120లో సంప్రదించాలని వెంకటరావు భార్య కుమారి కోరుతున్నారు.

స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరం



స్టడీ మెటీరియల్ ప్రదర్శిస్తున్న యూటీఎఫ్ సభ్యులు

మధురవాడ: పదో తరగతి విద్యార్థులకు అందించే స్టడీ మెటీరియల్ ఎంతో ఉపయోగకరంగా వుంటుందని చంద్రంపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.రాజబాబు అన్నారు. సోమవారం యూటీఎఫ్ యూనియన్ వారు అందించిన స్టడీ మెటీరియల్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిపుణులు ఎంతో జాగ్రత్తగా రూపొందించిన మెటీరియల్ విద్యార్థులకు ఎంతో చేదోడుగా ఉంటుందని, దీనిని అందిస్తున్న యూటీఎఫ్ వారు అభినందనీయులన్నారు. జిల్లా యూటీఎఫ్ అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, జిల్లా ఏపీటీఎఫ్ అధ్యక్షులు కోటాన శ్రీను, ఎస్టీయూ జిల్లా అధ్యక్షులు పి.దేముడుబాబు, బీటీఏ జిల్లా అధ్యక్షులు ప్రకాశ్‌బాబు, ముఖ్య సభ్యులు రత్నరాజు, సునీత, సోమయాజులు, స్వామి, ఉషారాణి, సోమేష్, మోహన్‌రావు, శ్రీను పాల్గొన్నారు.

మరమ్మతులు ప్రారంభం



పనులు ప్రారంభిస్తున్న కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు పుక్కళ్లపాలెంలో మత్స్యకార కమ్యూనిటీ భవనం మరమ్మతులకు రూ.8.50 లక్షలు జీవీఎంసీ నిధులు విడుదలైనట్లు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు తెలిపారు. సోమవారం ఆయన పనులు ప్రారంభించారు. గతంలో ఈ ప్రాంతంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించినప్పుడు స్థానిక మత్స్యకారులు ఈ సమస్యను ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు దృష్టికి తీసుకొచ్చారని..., ఆయన ఆదేశాల మేరకు నిధులు విడుదలయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో వాసుపల్లి అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



రంగనాథస్వామి గాథ నృత్యరూపకం



భరతనాట్యం చేస్తున్న విద్యార్థులు

ఆనందపురం : మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార ఆవాస విద్యాలయం వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహుతులను విశేషంగా అలరించాయి. వివిధ రాష్ట్రాలకు చెందిన సంప్రదాయ నృత్యాలకు సంగీతం, అభినయం మేళవించడంతో అందరినీ కట్టి పడేశాయి. భక్తికి కులం కంటే గుణమే ప్రధానమని తెలియజెప్పే ముని వాహనసేవ తిరుప్పావై – రంగనాథస్వామి గాథ నృత్యరూపకం ఎంతగానో అలరించింది. మణిపూర్ సరస్సులు, పవిత్ర స్థలాల అందాలను వర్ణిస్తూ సంప్రదాయ నృత్యం కళాత్మకంగా సాగింది. మయూరం విశ్వనాథ శాస్త్రి స్వరపరిచిన కీర్తనకు విద్యార్థులు చేసిన భరతనాట్యం లయాత్మకంగా సాగింది. సంక్రాంతి సంబరాల జానపద నృత్యం కళ్లకు కట్టినట్టు ప్రదర్శించారు.

యువకుడి అదృశ్యం



బోయి మహేష్

తగరపువలస: జీవీఎంసీ రెండో వార్డు వలందపేటకు చెందిన బోయి మహేష్ ఈ నెల 5న ఇంటి నుంచి అదృశ్యమైనట్లు భార్య శ్యామల భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేసింది. మధురవాడ డీమార్ట్‌లో పనిచేసే మహేష్ టిఫిన్ తీసుకొస్తానని ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదని ఫిర్యాదులో ఆమె పేర్కొంది. అతనికి గ్రామంలో అప్పులు ఎక్కువగా ఉండడంతో అదృశ్యానికి కారణం అదే అయి ఉండవచ్చని ఆమె తెలిపింది. ఫోన్ కూడా స్విచ్ ఆఫ్ చేసి ఉండటం, తెలిసిన వారిళ్లలో కూడా మహేష్ ఆచూకీ లభించలేదు. ఇటీవలే వీరికి వివాహం జరిగింది. భీమిలి ఏఎస్ఐ సత్తిబాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ



లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులతో వైస్ ఎంపీపీ బంగారునాయుడు, తదితరులు

తగరపువలస : భీమిలి మండలం లక్ష్మీపురం జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం వైస్ ఎంపీపీ బోని బంగారునాయుడు చేతుల మీదుగా విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్యాభివృద్ధికి చేస్తున్న కృషిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సాంకేతిక నైపుణ్యాన్ని జోడించి రూ.30 వేల విలువైన ట్యాబ్‌లు ఒక్కో విద్యార్థికి అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ లచ్చుబుగత జగదీశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు గాడు తాతినాయుడు, కరుభుక్త అప్పలనారాయణ, కనకల వెంకటరమణ, కరుభుక్త జోగినాయుడు, పూసర్ల రాములప్పడు, ప్రధానోపాధ్యాయుడు గాడు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

బక్కన్నపాలెంలో వివాహిత...



దాసరి సరిత

పీఎంపాలెం: పీఎం పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలోని బక్కన్నపాలెం భాస్కర్ నగర్‌కి చెందిన వివాహిత దాసరి సరిత (48) అదృశ్యమైంది. ఈ మేరకు ఆమె కుమారుడు వెంకటేష్ పీఎం పాలెం పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఆనందపురంలో ప్రభుత్వం తనకు కేటాయించిన స్థలం చూసి వస్తానని ఈ నెల 5న మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిన సరిత తిరిగి రాలేదు. ఆమె మానసికంగా ఇబ్బంది పడుతోందని, గతంలో కూడా ఒకసారి బెంగళూరు వెళ్లిపోయి తిరిగి వచ్చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్సాహంగా సంక్రాంతి సంబరాలు



సంతపేట హైస్కూల్‌లో సంబరాల్లో విద్యార్థులు



సంక్రాంతి సంబరాల్లో సందడి చేస్తున్న హరిదాసు

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డులోని పాఠశాలల విద్యార్థులు సోమవారం సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. సంతపేట అంబేడ్కర్ జీవీఎంసీ హైస్కూల్ ఆవరణలో విద్యార్థినులు రంగవల్లులు తీర్చిదిద్దారు. అనంతరం పాఠశాల ఆవరణలో భోగిమంట వేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎచ్చెర్ల జగన్నాథ స్వామి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. బంగ్లామెట్ట జీవీఎంసీ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో ఉపాధ్యాయులు నరహరిశెట్టి రమేష్, బుగత మల్లిక, పిన్నింటి నాగమణి పాల్గొన్నారు.

ఆనందపురం: మండలంలోని పలు పాఠశాలల్లో విద్యార్థులు సంక్రాంతి సంబరాలు ఉత్సాహంగా నిర్వహించారు. హరిదాసు, డూడూ బసవన్న, పల్లె పడుచుల వేషాలతో అలరించారు. పాఠశాల ఆవరణలో రంగవల్లికలు వేసి అందులో గొబ్బెమ్మలుపెట్టి నృత్యాలు చేశారు. భోగి మంటలు వేసి వాటి చుట్టూ తిరుగుతూ కేరింతలు కొట్టారు. అంతరించిపోతున్న మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. గంభీరం ప్రాథమిక పాఠశాలలో, వెల్లంకిలోని రవీంద్ర భారతి పాఠశాలలో సంబరాలు నిర్వహించారు. హెచ్ఎం యూవీవీ ప్రసాద్, ఉపాధ్యాయులు రామకృష్ణ, వరలక్ష్మి, రవీంద్రభారతి పాఠశాల చైర్మన్ ఎస్.మణి పాల్గొన్నారు.

మధురవాడ: చిన్నారుల హరిదాసు వేషధారణ, చిడతలు, భోగిపళ్లు పోయడం వంటి సన్నివేశాలు సంక్రాంతి ముందే వచ్చిందా అనిపించాయి. బక్కన్నపాలెం రోడ్డులోని మధురవాడ చైతన్య ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో విద్యార్థుల ఆటపాటలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రిన్సిపాల్ సందీప్, వైస్ ప్రిన్సిపాల్ ఉమా మహేశ్వరరావు, ప్రీ ప్రైమరీ ఇన్‌చార్జి దుర్గ, ప్రైమరీ ఇన్‌చార్జి దీప్తి పాల్గొన్నారు.



వివిధ వేషధారణల్లో చిన్నారులు



బంగ్లామెట్ట పాఠశాలలో సంబరాల్లో విద్యార్థులు

వీఆర్వోల సంఘం కార్యవర్గం

పద్మనాభం: పద్మనాభం మండల వీఆర్వోల సంఘం అధ్యక్షునిగా పెంట వీఆర్వో బొడ్డి.కృష్ణ నరసింహులు సోమవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షునిగా జి.శామ్యూల్, కార్యదర్శిగా కె.మల్లుదొర, సంయుక్త కార్యదర్శిగా ఎం.బి.సుమలత, కోశాధికారిగా పి.రవి కుమార్, మెంబర్లుగా కె.కనక మహాలక్ష్మి, ఎస్.కనకారావు ఎన్నికయ్యారు. పద్మనాభం తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో ఈ ఎన్నిక నిర్వహించారు.

అందరి మంచి కోరుకునే నాయకుడు సీఎం జగన్

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



భగవాన్ దాస్ కాలనీలో సంక్షేమ పథకాల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: అందరి మంచి కోరుకునే నాయకుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహనర్ రెడ్డి అని, ఆయనకు, ప్రభుత్వానికి ఎల్లవేళలా అండగా ఉండాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. జీవీఎంసీ 6వ వార్డు భగవాన్‌దాస్ కాలనీలో సోమవారం సాయంత్రం ఓపెన్ జిమ్ ప్రారంభించి, పరీక్షించారు. అనంతరం ఇక్కడ గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో నివాసాల వద్దకు వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుంటూ పరిష్కారానికి భరోసా ఇస్తూ, వారికి ప్రభుత్వం ద్వారా జరిగిన మేలుకు సంబంధించిన సంక్షేమ పథకాల పత్రాలు అందజేశారు. ఇప్పటికే కాలనీలో రూ.75 లక్షల వ్యయంతో గెడ్డకు రక్షణ గోడ, బ్రిడ్జి నిర్మాణం, ఇతర సంక్షేమ, అభివృద్ధి పనులు మరో రూ.12 కోట్లతో చేపట్టినట్టు చెప్పారు. ఇక్కడ కళ్యాణ మండపం నిర్మించాలని కాలనీ వాసులు కోరారు. దీంతో తక్షణమే స్థలం పరిశీలించాలని జీవీఎంసీ సర్వేయర్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ డాక్టర్ ముత్తంశెట్టి ప్రియాంక, వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ ఇన్‌చార్జి ముత్తంశెట్టి మహేష్, శ్రావణ్‌కుమార్, జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, డీఈ వంశీ, ఏఈ సురేష్, వార్డు జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ గాదే రోశిరెడ్డి, ఎస్సీ సెల్ నియోజకవర్గ ఇన్‌చార్జి సియాద్రి కనకరాజు, బెల్లాన ప్రసాద్, పిళ్లా సురేష్, వాండ్రాసి సూరప్పారావు, పిళ్లా రమణ, 7వ వార్డు అధ్యక్షుడు పోతిన శ్రీనివాసరావు, జిల్లా నాయకులు పిళ్లా సూరిబాబు, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పోటీలు నేడు

తగరపువలస: 49వ అంతర్జాతీయ హిందీ దివస్ సందర్భంగా ఆసక్తి కలిగిన విద్యార్థులకు మంగళవారం చిత్రలేఖనం, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించనున్నట్టు భీమిలి ఆదర్శ హిందీ ప్రేమీ మండలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు తెలిపారు. హిందీ, తెలుగు మాధ్యమాలలో నిర్వహించే పోటీల్లో ఉమ్మడి విశాఖ జిల్లాల విద్యార్థులు పాల్గొనవచ్చని సూచించారు. 8, 9, 10 తరగతులు ఒక వర్గంగా, ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ విద్యార్థులను రెండో వర్గంగా, డిగ్రీ, పీజీ విద్యార్థులను మూడో వర్గంగా పోటీలు నిర్వహించనున్నారు. విజేతలకు 10న బహుమతులు అందించనున్నారు. వివరాలకు 89856 47419, 89858 97419లో సంప్రదించాలని కోరారు.